క్లుప్తంగా

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోండి

మన్ననూర్: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కార్పొరేషన్ సంస్థల విశ్రాంత ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు వెంకటరమణ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. కోరారు. అచ్చంపేట నియోజకవర్గం ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగులు, వృద్ధులు ఓటు వేసే విధంగా సహకరించాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కోడేరు: మండల కేంద్రానికి చెందిన సొప్పరి మశమ్మ అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖరీం, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు జగదీశ్వర్‌రావు, సురేందర్‌రెడ్డి, చామంతి రాజులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పుట్ట రాము, పొండేళ్ల సురేష్, శరత్ బాబు, రామకృష్ణ, బాబు, గుండి తదితరులు పాల్గొన్నారు.

మాజీ వైస్ ఎంపీపీపై దాడి హేయమైన చర్య

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని హనుమాన్ నగర్‌లో కల్వకుర్తి మాజీ వైస్ ఎంపీపీ, కాంగ్రెస్ నాయకుడు బొమ్ము ఆంజనేయులుపై మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం దాడి చేయడాన్ని ఆర్యవైశ్య సంఘం మండల నాయకులు ఖండించారు. బుధవారం కల్వకుర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం నాయకులతో కలిసి బాధితుడు ఆంజనేయులు మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ అకారణంగా అసభ్య పదజాలంతో దూషిస్తూ తనపై దాడి చేశాడని బాధితుడి ఆరోపించారు. మాజీ వైస్ ఎంపీపీపై దాడిని నిరసిస్తూ బుధవారం కల్వకుర్తి పట్టణంలో ఆర్యవైశ్యులు వ్యాపార వాణిజ్య సముదాయాలను మూడు గంటలపాటు మూసి వేసి నిరసన వ్యక్తం చేశారు. సమావేశంలో కౌన్సిలర్ సతీష్, శివాలయం శ్రీనివాస్, వజ్రలింగం, శేఖర్, శ్రీనివాస్, సిమ్మయ్య, రఘు, తదితరులు ఉన్నారు. అదేవిధంగా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ దాడిని ఓ ప్రకటనలో ఖండించారు.

డ్రెయినేజీకి మరమ్మతు చేపట్టాలి



తాడూరు: మండలంలోని ఎటిదారిపల్లిలో పాఠశాలకు అనుసరించుకుని ఉన్న డ్రెయినేజీ ధ్వంసం అయింది. దీంతో మురుగు ముందుకు వెళ్లలేక ఒకేచోట నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. పదేళ్ల కిందట నిర్మించిన డ్రెయినేజీ కాలువ నిర్మించారు. నిర్వహణ సరిగ్గా లేక శిథిలావస్థకు చేరింది. సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయితీ అధికారులు మురుగుకాలువను పరిశీలించి తాత్కాలిక మరమ్మతు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కసిరెడ్డి విజయం కోసం పూజలు



కల్వకుర్తిరూరల్: కాంగ్రెస్ కల్వకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం మండలంలోని తాండ్ర, జీడిపల్లి గ్రామాల్లోని ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆ పార్టీ నాయకులు పూజలు నిర్వహించారు. తాండ్ర ఆంజనేయ స్వామి దేవాలయంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఆశాదీప్‌రెడ్డిలు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్వేశ్వర్‌గౌడ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

పెద్దకొత్తపల్లి: మండలంంంంలోని ముష్టిపల్లి గ్రామానికి చెందిన నన్నయ్య పొలంలో గడ్డివాము ఏర్పాటు చేశారు. బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పుపెట్టారు. గమనించిన చుట్టుపక్కల రైతులు బాధిత రైతుకు సమాచారం ఇచ్చారు. బాధితుడు ఘటన స్థలానికి చేరుకునేలోపే అగ్నికి ఆహుతి అయ్యింది. సుమారు రూ.20 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.



ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల తరలింపు
- పరిశీలించిన కలెక్టర్ ఉదయ్‌కుమార్



కొల్లాపూర్‌లో ఈవీఎం యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

కొల్లాపూర్: ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ ఉదయ్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాల ఆవరణలో ఉద్యోగులతో సమావేశం అయ్యారు. ఈవీఎంల తరలింపు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఆర్టీసీ బస్సుల్లో సాయంకాలం ఈవీఎంలు, విధుల్లో పాల్గొనే అధికారులను పోలింగ్ కేంద్రాలకు తరలించారు. గురువారం పోలింగ్ ముగిశాక ఈవీఎంలను నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని అగ్రికల్చర్ గోదాంలోకి తరలించనున్నట్లు తెలిపారు. ఈవీఎంల భద్రతను పరిశీలించేందుకోసం ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులకు, వారి ఏజెంట్లకు పాసులు జారీచేసినట్లు కలెక్టర్ వివరించారు. పోలింగ్‌ను ప్రశాంతంగా, సాఫీగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట ఆర్‌ఓ కుమార్ దీపక్, ఏఈఆర్‌ఓ శ్రీకాంత్, ఆర్డీఓ నాగరాజు ఉన్నారు.

కొల్లాపూర్‌లో పెరిగిన ఓటర్లు

ఎన్నికల నోటిఫికేషన్ ప్రారంభం నాటికి కొల్లాపూర్‌లో 2,29,399 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. ఆ తర్వాత కూడా కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగింది. ఇప్పుడు నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,34,167గా అధికారులు ప్రకటించారు. అంటే కొత్తగా 4,768 మంది ఓటు హక్కు నమోదు చేసుకున్నారు.

పోలింగ్ కేంద్రాలు ఇలా...

కొల్లాపూర్‌లో మొత్తం పోలింగ్ కేంద్రాలు 269 ఉన్నాయి. పెద్దకొత్తపల్లి మండలంలో 1 నుంచి 54 వరకు, కోడేరు మండలంలో 55 నుంచి 94 వరకు, పాన్‌గల్‌లో 95 నుంచి 137 వరకు, వీపనగండ్లలో 138 నుంచి 165 వరకు, చిన్నంబావిలో 166 నుంచి 195 వరకు, పెంట్లవెల్లిలో 196 నుంచి 215 వరకు, కొల్లాపూర్ మండలంలో 216 నుంచి 265 వరకు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.



పీజీ కళాశాల నుంచి ఈవీఎం యంత్రాలు తీసుకొస్తున్న సిబ్బంది

ఎన్నికల్లో పాల్గొనే అధికారులు

కొల్లాపూర్ నియోజకవర్గంలో పోలింగ్ విధుల్లో మొత్తం 1400 మంది అధికారులు పాల్గొంటున్నారు. 700 మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేశారు. 132 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఇలా...

నియోజకవర్గంలో మహిళలు, యువత, దివ్యాంగుల ఓటింగ్ కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. యువత కోసం తెల్లరాళ్లపల్లి తండాలోని ఎంపీఎస్‌లో 123వ పోలింగ్ కేంద్రం, దివ్యాంగుల కోసం కొల్లాపూర్ పట్టణంలోని సత్యసాయి విద్యావిహార్‌లో 244 పోలింగ్ కేంద్రం, మహిళల కోసం వీపనగండ్ల జెడ్పీహెచ్‌ఎస్‌లోని 161,162 163, ప్రాథమిక పాఠశాలలో 164,165 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మోడల్ పోలింగ్ కేంద్రాలుగా పెద్ద కొత్తపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 17వ కేంద్రం, పెంట్లవెల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లోని 204 పోలింగ్ కేంద్రం, మాచుపల్లి పీఎస్‌లోని 59, అమరిగిరిలోని 262, పాన్‌గల్ జెడ్పీహెచ్‌ఎస్‌లోని 115 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కల్వకుర్తిలో..



ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ పమేలా సత్పతి

కల్వకుర్తి: రాష్ట్ర శాసనసభకు నేడు జరిగే ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు రిటర్నింగ్ అధికారి శ్రీను తెలిపారు. పట్టణంలోని సీబీఎం కళాశాలలో ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయాన్నే ఎన్నికల సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకోవటంతో వారికి మరోమారు ఎన్నికల్లో అనుసరించాల్సిన అంశాలపై రిటర్నింగ్ అధికారి మరోమారు వివరించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందితో రంగారెడ్డి కలెక్టర్ పమేలా సత్పతి ఇంట్రాక్షన్ నిర్వహించారు. మధ్యాహ్న భోజన విరామం తర్వాత ఈవీఎంలను తీసుకొని సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బయలుదేరారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది నేటి పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేయనున్నారు. నియోజకవర్గంలోని 262 పోలింగ్ కేంద్రాలను కలిపి ఎన్నికల, పోలీస్ సిబ్బంది కలిపి 2,143 మంది విధుల్లో పాల్గొననున్నారు. ఈవీఎంలతో పాటుగా పోలీస్ సిబ్బందిని 24 రూట్లుగా విభజించి, వారికి ఆయా పోలింగ్ కేంద్రాలకు స్కూల్‌బస్సుల ద్వారా బయలుదేరేలా ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 2,41,762 మంది ఓటర్లు ఉండగా.. 1,22,693 మంది పురుషులు, 1,19,062 మంది మహిళా ఓటర్లు వారి ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. పోలీసులకు సైతం వారి అధికారులు దిశానిర్దేశం చేశారు.

కొల్లాపూర్ నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు ఇలా

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
పెద్దకొత్తపల్లి	24,075	23,447	03	47525
కోడేరు	17,635	16,745	-	34,380
పాన్‌గల్	21,029	19,846	01	40,876
వీపనగండ్ల	11,563	11,190	-	22,753
చిన్నంబావి	12,288	12,142	-	24,430
పెంట్లవెల్లి	8,828	8,478	-	17,306
కొల్లాపూర్	23,845	23,052	-	46,897
మొత్తం	1,19,263	1,14,900	04	2,34,167



హాజరైన అధికారులు

ఓటరు పత్రంలో రూట్‌మ్యాప్



పాన్‌గల్‌లో ఓటర్లకు ఓటరు పత్రాలను అందిస్తున్న తహసీల్దార్ (ఫైల్)

- క్యూఆర్ కోడ్‌తో పంపిణీ
- బీఎల్‌ఓల పేరు, ఫోన్ నంబర్ల ముద్రణ
- ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు

పాన్‌గల్: ఈనెల 30న జరగనున్న శాసన సభ ఎన్నికల కోసం మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో పాటు సిబ్బంది కేటాయింపు యాదృచ్ఛిక ప్రక్రియ ద్వారా పూర్తి చేశారు. దీంతో పాటుగా ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా ఓటింగ్ స్లిప్‌ల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుది. ఓటరు పత్రంలో ఎడమవైపు ఫొటో స్థానంలో క్యూర్ కోడ్ ఉంది. పోలింగ్ తేదీ, పోలింగ్ ప్రారంభం, ముగింపు సమయాలను కూడా ముద్రించారు. అదేవిధంగా కుడివైపున నియోజకవర్గం పేరు, ఓటరు గుర్తింపు కార్డు నంబరు, గ్రామం పేరు, పోలింగ్ కేంద్రం టోల్‌ఫ్రీ నంబర్ 1950లను ముద్రించారు. పత్రానికి వెనుకవైపున రూట్‌మ్యాప్ కూడా ఉంది. అందులో పోలింగ్ కేంద్రానికి వెళ్లడానికి దారి, అది ఏ ప్రాంతంలో ఉందో సూచించే విధంగా మ్యాప్‌తో పాటు బూత్ లెవల్ అధికారి పేరు, వారి ఫోన్ నెంబరును ముద్రించారు.

86,263 ఓటర్లు

కొల్లాపూర్ నియోకవర్గంలోని పాన్‌గల్, వీపనగండ్ల, చిన్నంబావి మండలాల్లో 86,263 మంది ఓటర్లు ఉండగా.. 107 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు 107 మంది బూత్ లెవల్ అధికారులను నియమించారు. ప్రతి ఓటరుకు పోలింగ్ స్లిప్‌ల పంపిణీపై ఆరా తీసేందుకు సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేస్తున్నారు. బీఎల్‌ఓలు ఇళ్లకు వెళ్లిన సమయంలో ఎవరైనా ఇంటికి తాళం వేసి ఉంటే వారి పోలింగ్ స్లిప్పులను పోలింగ్ రోజున కేంద్రంలో బూత్‌లెవల్ అధికారులతో ఏర్పాటు చేసే సహాయక కేంద్రంలో వారికి అందించనున్నారు. ఓటు వేసేందుకు వెళ్లేటప్పుడు ఈ ఓటరు పత్రంతో పాటు ఎన్నికల సంఘం ప్రకటించిన 12 రకాల గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒక దానిని వారి వెంట తీసుకొని వెళితేనే ఓటు వేసేందుకు అధికారులు అనుమతిస్తారు.

మండలాల వారీగా..

మండలం	పోలింగ్ కేంద్రాలు	బీఎల్‌ఓలు	ఓటర్లు
పాన్‌గల్	43	43	40,876
చిన్నంబావి	30	30	23,820
వీపనగండ్ల	28	28	21,567

అర్హులైన ప్రతి ఓటరుకు..



ఈనెల 30వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికలల్లో అర్హులైన ప్రతి ఓటరు ఓటు వేసేలా పోల్ చిట్టి అందించాలి. వలస ఓటర్లు ఓటు వేసేందుకు వచ్చిన సమయంలో వారికి ఇబ్బందులు కలగకుండా బీఎల్‌ఓలు అందుబాటు ఉండాలి. ప్రతి ఓటరుకు బీఎల్‌ఓలు ముందుగానే ఈవీఎం మిషన్లపై అవగాహన కల్పించాలి.

– బాల్యానాయక్, తెల్లరాళ్లపల్లితండా

ఓటు వినియోగించుకోవాలి



ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకునేలా అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పించాలి. అధికారులందరూ క్షేత్ర స్థాయిలో పర్యవేక్షన చేస్తూ పోలింగ్ శాతం పెంచాలి. ఓటు వేసే ప్రతి ఓటరు పోల్ చిట్టితో పాటు ఎన్నికల సంఘం సూచించిన గుర్తింపు కార్డులల్లో ఏదైనా ఒకటి తీసుకవెళ్లాలి.

– ఆదిల్‌పాషా, పాన్‌గల్

విధుల్లో అలసత్వం వద్దు



బూత్ లెవల్ అధికారులు ఆయా గ్రామాల్లో ప్రతి ఓటరుకు ఓటరు పత్రాలను ఈనెల 25వ తేదీలోగా పంపిణీని పూర్తి చేయాలి. ఓటరు పత్రాలు మిగిలిపోతే వాటిని పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసే సహాయక కేంద్రంలో అందించాలి. విధుల నిర్వహణలో బూత్‌లెవల్ అధికారులు ఎట్టి పరిస్థితులల్లో అలసత్వం వహించకూడదు. విధుల్లో అలసత్వం వహించే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటాం.

– రాంబాయి, తహసీల్దార్, పాన్‌గల్

ఏదేని ధ్రువీకరణ పత్రం తీసుకెళ్లండి

నాగర్‌కర్నూల్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో ఓటు హక్కు వినియోగించుకోడానికి ఓటరు గుర్తింపు కార్డు(ఎపిక్ కార్డు)కు ప్రత్యామ్నాయంగా 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి వెంట తీసుకెళ్లాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఓటరు గుర్తింపుకార్డు, ఆధార్, ఉపాధిహామీ జాబ్ కార్డు, బ్యాంకు, తపాలా కార్యాలయం జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్ బుక్, కేంద్ర కార్మిక శాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్ ఇండియా(ఆర్జీఐ), నేషనల్ పాపులేషన్ రిజిస్టర్(ఎన్‌పీఐ) కింద జారీ చేసిన స్మార్ట్ కార్డు, భారతీయ పాస్ పోర్ట్, ఫొటోతో కూడిన పెన్షన్ పత్రాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, పీఎస్ యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు, కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసిన యూనిక్ డిజేబుల్ గుర్తింపు కార్డు (యూడీఐడీ)లు కలిగి ఉండాలన్నారు. ఈ 12 కార్డుల్లో ఏ గుర్తింపు కార్డు ఉన్నా.. ఓటు వేయవచ్చని తెలియజేశారు. ఎవరైన కార్డు చూయించిన ఇబ్బందులకు గురిచేస్తే ఫిర్యాదు చేయొచ్చని పేర్కొన్నారు. ఓటర్లు సహకరించాలని కోరారు.

పాలిథీన్ కవర్లతో కూరగాయల సాగు



చెన్నపురావుపల్లిలో పాలిథిన్ కవర్లతో కూరగాయల సాగు

పెద్దకొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల రైతులు పాలిథీన్ కవర్ల కూరగాయల సాగుపై మక్కువ చూపుతున్నారు. మండలంలోని సాతాపూర్, చెన్నపురావుపల్లి, చిన్నకార్పాముల, కల్వకోల్ గ్రామాల్లో రైతులు కూరగాయలు సాగు చేపట్టారు. పాలిథీన్ కవర్‌లను ఏర్పాటు చేసుకొని మధ్యమధ్యలో రంధ్రాలు ఏర్పాటు చేసి డ్రిప్ సౌకర్యం ద్వారా మొక్కలకు నీరు అందిస్తున్నారు. నీటి తేమశాతం ఆరిపోకుండా పాలిథీన్ కవర్ ఉపయోగపడుతుందని రైతులు పేర్కొన్నారు. కలుపు మొక్కలు కూడ పెరగకపోవడంతో కూరగాయల దిగుబడి పెరుగుతుందని రైతులు వివరించారు. ఒక ఎకరాకు పాలిథీన్ కవర్లు రూ.4 వేల ఖర్చు అవుతుందని రైతులు తెలిపారు.

రోడ్లపైనే విక్రయాలు

- కోడేరు సంతలో అవస్థలు
- ఇబ్బందులు పడుతున్న కొనుగోలుదారులు



కోడేరులో రోడ్డుపై నిర్వహిస్తున్న సంత

కోడేరు: మండల కేంద్రంలో నిర్వహించే సంతలో ఉన్న సమస్యలు తిష్ట వేశాయి. అన్నదాతల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయి సిబ్బంది ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల వ్యాపారులకు వసతులు కల్పించడం లేదు. దీంతో సంతలో సమస్యలు తాండవిస్తున్నాయి. మండల కేంద్రంలో ప్రతి మంగళవారం వారాంతపు సంత నిర్వహిస్తున్నారు. కూరగాయల విక్రయించేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మండలం నుంచి పస్పుల, కదిరెపాడు, సింగాయిపల్లి, రేవల్లి, తదితర గ్రామాల నుంచి రైతులు పండించిన కూరగాయలను సంతలో విక్రయిస్తుంటారు. కనీసం కూర్చోవడానికి కూడా స్థలం లేక నరకయాతన అనుభవిస్తున్నారు. ఎండ, వానలోనే రైతులు కూరగాయలు విక్రయించాల్సిన దుస్థితి నెలకొంది. రోడ్లపైనే కూర్చొని కూరగాయలు అమ్ముతుండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వినియోగదారులకు పార్కింగ్ స్థలంలేక రాకపోకలకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి.

బస్సుల రాకపోకలకు అడ్డంకులు

మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ సమీపంలో నిర్వహిస్తుండటంతో బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికితోడు రోడ్లపైనే రైతులు, వినియోగదారుల వాహనాల పార్కింగ్ చేయడంతో బస్సులు కొంత దూరంలోనే నిలపాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో ఆర్టీసీ ప్రయాణికులు గ్రామాలకు వెళ్లేందుకు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సంతను మరొక చోటకు మార్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కనీస వసతులు కరువు

ప్రతి వ్యాపారి దగ్గర నుంచి పంచాయతీ అధికారులు తైబార్ వసూలు చేస్తున్నారు. కాని వారికి కనీసవసతులు కల్పించడంతో నిర్లక్ష్యం వహిస్తున్నారు. షెడ్లు, మరుగుదొడ్ల సౌకర్యాలు లేక నరకయాతన అనుభవిస్తున్నారు. వ్యాపారులతో పాటు కొనుగోలు దారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండలో కూరగాయలు విక్రయించడంతో కూరగాయలు వాడిపోతున్నాయి. కూరగాయల మార్కెట్ కోసం ప్రత్యేక షెడ్లను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

మరోచోటికి మార్చాలి



స్థానిక బస్టాండ్‌లో రోడ్డుకు ఇరువైపులా సంతను కొనసాగించడం వల్ల వాహనాలు, ఎద్దుల బండ్లు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రోడ్లపై వెళ్లే వారికి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సంతను మరొక చోటకు మార్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

–మిద్దె రామకృష్ణ, కోడేరు

సదుపాయాలు కల్పించాలి

కూరగాయల సంతలో వ్యాపారులు, కొనుగోలు దారులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వసతులు లేవు. అత్యవసర పరిస్థితిలో ఎక్కడికెళ్లాలో తెలియడం లేదు. గ్రామ పంచాయతీ సిబ్బంది పట్టించుకొని కూరగాయల సంతలో కనీస వసతులు ఏర్పాటు చేయాలి.

–నిర్మల, కోడేరు

ప్రభుత్వ స్థలంలోకి..

గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ స్థలం ఉంటే సంతను మరొక చోటకు మార్చేందుకు చర్యలు తీసుకుంటాం. బస్టాండ్‌లో సంత నిర్వహిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నది వాస్తవమే. వినియోగదారుల, రైతుల సౌకర్యార్థం వేరేచోటికి మారుస్తాం.

– బాలచందర్‌సృజన, ఎంపీడీఓ

పోలింగ్‌కు ఏర్పాట్లు ముమ్మరం

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో గురువారం జరగనున్న పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ గంగమోహన్ తెలిపారు. మండలంలో మొత్తం 37 బూతులకు గాను దాదాపు 28 వేల ఓటర్లు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. మండల కేంద్రంలో మొత్తం 4 బూతులకు గాను 247, 248 బూతులను కూచుకుళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, 249, 250 బూతులను ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.